క్లుప్తంగా

ఆశ్రమ నిర్మాణ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వినుకొండ: అతి పురాతనమైన కొండమెట్ల వద్ద వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం విశ్వమాత గోసంరక్షణ ఆశ్రమ నిర్మాణం వాల్‌పోస్టర్లను స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య అన్నదానం చేస్తున్న ఆలయ కార్యనిర్వాహక నిత్య అన్నదాన సేవకులు జాజుల మాల్యాద్రి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏజీపీ ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, సీనియర్ న్యాయవాది పొట్లూరి సైదారావు, కౌన్సిలర్ పీవీ సురేష్‌బాబు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రమణారావు, కృష్ణవేణి, రామా వెంకటేశ్వర్లు, వై. నాగలక్ష్మి, భక్తబృందం పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలో డీఈవో తనిఖీలు

నాదెండ్ల: పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం పల్నాడు డీఈవో ఎల్ చంద్రకళ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. నాదెండ్ల, చిరుమామిళ్ళ, సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. శుక్రవారం బయలాజికల్ పరీక్ష జరిగింది. సాతులూరు జెడ్పీ హైస్కూలులో 264 మందికి గాను ఇరువురు, నాదెండ్లలో 99 మందికి గాను ఇరువురు, చిరుమామిళ్ళలో 185 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు.

పొలం వివాదాలపై విచారణ



బొల్లాపల్లి: మండలంలోని కనుమలచెరువు, అయ్యన్నపాలెం గ్రామాల్లోని పొలాలను మండల ప్రత్యేక అధికారి, వినుకొండ వ్యవసాయ శాఖ సహాయసంచాలకులు బి.రవిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల సమస్యలపై ఆయా గ్రామాల్లో భూవివాదాలను విచారణ చేపట్టినట్లు తెలిపారు. కనుమలచెరువు,అయ్యన్నపాలెంల్లో ఏల్చూరు ఏడుకొండలు, సూరె రామకృష్ణలు దీర్ఘకాలికంగా పొలం వివాదాల విషయంలో ఫిర్యాదులు రావడంపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ విచారణ చేశామని ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ



నరసరావుపేట: పవిత్ర రంజాన్ పర్వదినాల సందర్భంగా శుక్రవారం భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు అమ్మ జిలానీ నేతృత్వంలో ప్రకాష్ నగర్‌లోని హాండ్స్ ఆఫ్ కంపాషన్ జాయ్ హోం వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. దీనికి బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యులు వల్లెపు కృపారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి కృష్ణమోహన్, జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి కటా అంజనారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగిశెట్టి రమేష్, దరియా, మాలపాటి కృష్ణశంకర్ పాల్గొన్నారు.

త్వరలో శావల్యాపురం సొసైటీ డిజిటలైజేషన్

శావల్యాపురం: శావల్యాపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) పరిధిలో త్వరలో ఆన్‌లైన్ ద్వారా రైతులకు ఆర్థిక లావాదేవీల నిర్వాహణ జరుగుతుందని సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు తెలిపారు. శుక్రవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో సీఈవో నాగప్రసాదు మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 14 గ్రామాలు ఉండగా 5 వేల మంది రైతులు సభ్యత్వం కల్గియున్నట్లు తెలిపారు. 1180 మంది రైతులు అప్పులు తీసుకున్నట్లు తెలిపారు. ఇక నుంచి సొసైటీ పరిధిలో జరిగే ఆర్థిక లావాదేవీలన్నీ డిజిటలేజేషన్ ద్వారా కొనసాగుతాయన్నారు. డిజిటలైజేషన్ పనులు తుదిదశకు చేరినట్లు తెలిపారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం సారథ్యంలో శావల్యాపురం, వేల్పూరు గ్రామాల్లో జనరిక్ మందుల దుకాణాలు ప్రారంభోత్సవం చేస్తామన్నారు.

2న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

నూజెండ్ల: వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్త,ఆయా పోస్టులకు వచ్చే నెల 2వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించబడుతున్నాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ముదివర్తి అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నడిగడ్డ-1, తిమ్మాపురం, కృష్ణాపురం,గ్రామాల సెంటర్లకు అంగన్‌వాడీ కార్యకర్తలకు వెంకుపాలెం-2, పిట్టంబండ-01, శావల్యాపురం-04,పువ్వాడ, చినకంచర్ల,-01, కొండలరాయునిపాలెం-02, కొత్త నాగిరెడ్డిపల్లె, భూమాయపాలెం-01, గాంధీనగర్ గ్రామాల్లో అంగన్‌వాడి సెంటర్లలో ఆయా పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించటం జరిగిందన్నారు.

ఆధార్ 'అప్‌డేట్' అవస్థలు

- సవరణలకు క్యూకడుతున్న ప్రజలు
- నత్తనడకన సర్వర్.. రోజుకు 30 కార్డులే అప్‌డేట్!
- శాశ్వత ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలంటూ పలువురు వినతి



గణపవరం సచివాలయంలో ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

నాదెండ్ల: ప్రతి పనికీ ఆధార్... ప్రతి పథకానికీ ఆధార్... భారతీయ పౌరుడి గుర్తింపుకు ఆధార్ కార్డే కీలకం. 2013లో అప్పటి ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతి పౌరుడికీ ఆధార్‌కార్డు జారీ చేసింది. కొన్ని నెలల పాటూ జరిగిన ప్రక్రియలో ప్రజలందరూ ఆధార్‌కార్డులను నమోదు చేయించుకుని పొందారు. అయితే ఆధార్‌కార్డుల్లో పేర్లు, చిరునామా, వయస్సు తదితరాల్లో తప్పులు దొర్లి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాక జిల్లాల పునర్విభజన జరగటంతో గుంటూరు జిల్లా స్థానంలో పల్నాడు జిల్లాగా నమోదు చేయించుకోవాల్సి ఉంది. అయితే ఆధార్‌కేంద్రాలు సరిపడా లేకపోవటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

తాత్కాలిక కేంద్రాల ద్వారా సేవలు

మండలంలోని పలు గ్రామాల్లో తాత్కాలిక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి సవరణలు చేశారు. కేవలం ఒకట్రెండు రోజులు మాత్రమే కేంద్రాలు నిర్వహించారు. సర్వర్ల మొరాయింపు, ఇంటర్నెట్ సరిగా అందకపోవటం వంటి కారణాలతో అరకొరగానే ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేశారు.

రోజుకు ముప్పై కార్డులే..

గణపవరం ఒకటో సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం నత్తనడకన సాగుతోంది. సర్వర్ నెమ్మదిగా పనిచేస్తుండటంతో సచివాలయం వద్ద కార్డుదారులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గురు, శుక్రవారాలు రెండు రోజులు రెండు కంప్యూటర్ల ద్వారా ఆధార్ అప్‌డేట్ సేవలందించారు. అయితే రోజుకు కేవలం 30 కార్డుల చొప్పున అరవై మంది ఆధార్‌కార్డులను మాత్రమే అప్‌డేట్ చేయగలిగారు. గ్రామంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామంటూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటూ గ్రామంలో ప్రచారం చేయడంతో పెద్ద ఎత్తున కార్డుదారులు అప్‌డేట్ చేయించుకునేందుకు తరలివచ్చారు. సవరణలు, చిన్నారులకు నూతన కార్డుల నమోదుకు భారీగా తరలివచ్చారు. రోజుకు కేవలం పదుల సంఖ్యలో అప్‌డేట్ అవుతుండటంతో ప్రజలు విసిగిపోయారు. శనివారం ఒక్కరోజు మాత్రమే ఆధార్ కేంద్రం పనిచేయనుంది.

ప్రతిరోజూ వందల సంఖ్య లో ప్రజలు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకునేందుకు వస్తున్నారని, అయితే సర్వర్ నిదానంగా పనిచేయటంతో చేయలేకపోతున్నామని సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. మండల కేంద్రంలో గానీ, మేజర్ పంచాయతీ గణపవరంలో గానీ శాశ్వతంగా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తేనే తమకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

> **పర్మినెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి**
>
> 
>
> మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో 25 వేల మంది జనాభా ఉన్నారు. కేవలం రెండు రోజులు మాత్రమే ఆధార్ అప్‌డేట్‌కు అధికారులు అవకాశం కల్పించారు. అప్‌డేట్ చేయించుకునేందుకు లబ్ధిదారులు భారీగా తరలివచ్చారు. రెండు కంప్యూటర్ల ద్వారా రెండు రోజుల్లో అరవై కార్డులను మాత్రమే అప్‌డేట్ చేయగలిగాం. మండల కేంద్రంలో గానీ మేజర్ పంచాయతీలో గానీ శాశ్వత ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరాం.
>
> – మారుతీబాబు, పంచాయతీ కార్యదర్శి

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్‌బీఐ రీజనల్ చీఫ్ మేనేజరు రమేష్‌బాబు
- ఇర్లపాడు కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న రమేష్‌బాబు, శివప్రసాదు

శావల్యాపురం: ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారులు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు రీజనల్ చీఫ్ మేనేజరు వేదాం రమేష్ బాబు అన్నారు. శుక్రవారం శావల్యాపురం ఎస్‌బీఐ బ్యాంకు శాఖలో మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన ఆరుమళ్ల లక్ష్మయ్య ఇటీవల బైకు ప్రమాదంలో మృతి చెందగా నామిని భార్య సామ్రాజ్యంకు బీమా పథకం ద్వారా లబ్ధిపొందిన రూ. 20 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజరు మాట్లాడుతూ ఒంగోలు రీజనల్ పరిధి పరిధిలో 47 బ్యాంకు శాఖలు ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలో వినుకొండ ఎస్‌బీఐ బ్యాంకు శాఖ-01, శావల్యాపురం బ్యాంకు పరిధిలో 02 బీమా యోజన పథకాలు మంజూరైనట్లు తెలిపారు. 18 నుంచి 65 సంవత్సరాల లోపు కలిగిన బ్యాంకు ఎస్‌బీఐ ఖాతాదారులు బీమా పథకాలు ద్వారా లబ్ధిపొందాలన్నారు. ఇందులో భాగంగా రూ. 20 నుంచి 2000 వేల వరకు బీమా పథకానికి ప్రతి ఏటా నగదు చెల్లింపులు చేస్తే రోడ్డు ప్రమాదం, విద్యుత్ షాక్, పాముకాటు, నీటిలో గల్లంతు, తదితర వాటిలో అకాలంగా మృత్యువాత పడితే సంబంధిత బ్యాంకు ఖాతాదారుడు నామిని కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తామన్నారు. ఈఏడాది నూతనంగా సంవత్సరం కాలానికి రూ.2 వేలు చెల్లిస్తే రూ.40 లక్షల బీమా యోజన పథకానికి అర్హత పొందుతారన్నారు. శావల్యాపురం బ్యాంకు పరిధిలో ఇప్పటి వరకు ముద్ర రుణాలు రూ. 4 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రీజనల్ బ్యాంకు సహాయ మేనేజరు జె.శ్రీనివాసరావు, బ్యాంకు మేనేజరు వలేటి ప్రసాదు, నగదు అధికారి శ్రీహరి, బీమా అధికారి ఆర్. సాగర్ బాబు, బ్యాంకు సిబ్బంది దాసరి ప్రకాష్, ఈస్తిరిరాణి, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: గణపవరంలో జాతీయ రహదారిపై విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. హైవేకు ఇరువైపులా పరిశ్రమలు, ఐసీఎం రోడ్డు, మువ్వావారి వీధి, తిమ్మాపురం పరిశ్రమలు, మద్దిలక్ష్మయ్య గెస్ట్‌హౌస్ రోడ్డులోని గృహ, వాణిజ్య, పరిశ్రమలకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పొలం వివాదాలపై విచారణ

బొల్లాపల్లి : మండలంలోని కనుమలచెరువు, అయ్యన్నపాలెం గ్రామాల్లోని పొలాలను మండల ప్రత్యేక అధికారి, వినుకొండ వ్యవసాయ శాఖ సహాయసంచాలకులు బి.రవిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల సమస్యలపై ఆయా గ్రామాల్లో భూవివాదాలను విచారణ చేపట్టినట్లు తెలిపారు. కనుమలచెరువు,అయ్యన్నపాలెంల్లో ఏల్చూరు ఏడుకొండలు, సూరె రామకృష్ణలు దీర్ఘకాలికంగా పొలం వివాదాల విషయంలో ఫిర్యాదులు రావడంపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ విచారణ చేశామని ఏడీఏ తెలిపారు.

దాడి ఘటనపై ముగ్గురిపై కేసు

నాదెండ్ల: ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తిని కారుతో అడ్డగించి దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కావూరుకు చెందిన మలిశెట్టి సుబ్బారావు ఈ నెల 26న వ్యక్తిగత పనులపై చిలకలూరిపేట నుంచి గణపవరం వెళ్తున్నాడు. ఈ క్రమంలో హెల్త్‌క్లబ్ వద్దకు రాగానే తన ద్విచక్రవాహనాన్ని కారుతో అడ్డగించి కారులో ఉన్న బాషా, మరో ముగ్గురు వ్యక్తులు కర్రలతో దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి

- ప్రో ఐటీ సొల్యూషన్స్ ఫౌండర్ సి.హెచ్.శ్రీరామ్‌రెడ్డి
- ఎఎంరెడ్డిలో ఎఎంఆర్ హ్యాక్‌మానియా 2కే25

నరసరావుపేట రూరల్: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటేనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రో ఐటీ సొల్యూషన్స్ ఫౌండర్ సి.హెచ్.శ్రీరామ్‌రెడ్డి తెలిపారు. ఏఎమ్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఏఎమ్ఆర్ హ్యాక్‌మానియా 2కే25 సాంకేతిక సమ్మేళనం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీరామ్ రెడ్డి, కొల్రూట్ గ్రూప్ సీనియర్ హెడ్ కొనతం వేణు గోపాల్, సాఫ్ట్‌వేర్ కన్సల్‌టెంట్ రాజశేఖరరెడ్డి, రేషియోస్పియర్ టెక్నాలజీస్ కో-ఫౌండర్ విజయ్‌కుమార్, మెటిక్యులస్ ఆర్బిట్ కోఫౌండర్ శ్రీరామురెడ్డిలు పాల్గొన్నారు. మొదటి రోజు వివిధ కళాశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. సాంకేతిక పోటీలో 60 జట్లు రెండవ రౌండ్‌కు ఎంపికయ్యాయి. విజేతలైన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న శ్రీరామ్‌రెడ్డి

కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ మల్లికార్జున్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ ఎ.కిశోర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ పేద ముస్లింలకు నిత్యావసరాలు

చిలకలూరిపేట: పండుగల వేళ నిరుపేదలకు స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవడం అభినందనీయమని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పీవీ సుబ్బారావు చెప్పారు. గార్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని 120 నిరుపేద ముస్లిం కుటుంబాల వారికి శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించటం ఆదర్శనీయమని కొనియాడారు. గార్స్ సంస్థ ఉపాధ్యక్షుడు గేరా యాకోబు మాట్లాడుతూ 120 నిరుపేద ముస్లిం కుటుంబాలను గుర్తించి ఒక్కొక్కరికీ రూ. రెండు వేలు విలువైన నిత్యావసరాలు అందజేస్తామని చెప్పారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పి.బుల్లిబాబు, వి.చంద్రం, ఐ.శివనాగరాజు, ఎస్. దానయ్య, షేక్ బాజీ, జె.బుల్లిబాబు పాల్గొన్నారు.

వినుకొండలో....

వినుకొండ: పట్టణంలో ఇందిరానగర్ నూరాని మసీదులో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పేద ముస్లింలకు నిత్యావసర సరుకులను తహసీల్దార్ సురేష్ నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

■ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నరసరావుపేట రూరల్: ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.1.5 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. కళాశాలలో సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతున్న బి.వెంకటగోపి ఈనెల 12వ తేదీన పెట్లూరివారిపాలెం కాలువకు స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ముందుకు వచ్చారు. రూ.1.5 లక్షలను సేకరించి కురిచేడు మండలం వీరమ్మపాలెంలోని బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, సీఎసీ విభాగాధిపతి డాక్టర్ ఎస్ఎస్ తిరుమలరావులు అభినందించారు.

■ రుణం రాని వారు వివరాలివ్వండి

నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలో టిడ్కో పథకం కింద గృహం పొంది ఇప్పటివరకు బ్యాంకు రుణం పొందనివారు తమ వివరాలను వెంటనే పురపాలక కార్యాలయంలో అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ లేకపోవడం వలన, ఇతర లోన్లు ఉండటం వలన, అధిక వయస్సు కారణంగా బ్యాంకు రుణం పొందేందుకు అర్హతలేని వారికి రుణం బ్యాంకు వారిచే మంజూరు చేయబడలేదన్నారు.

■ సభ్యులకు శిక్షణ తరగతులు

శావల్యాపురం: స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘులకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై గ్రామసంఘం అసిసెంట్స్‌లకు, ఎన్యూమరేటర్స్‌కు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ పాల్గొని మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో మహిళా సభ్యులు జీవనోపాదుల అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీయం జి.వాసుబాబు,సీసీలు ఖాజావలీ,కరుణమ్మ,మండల సమాఖ్యా అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, సెక్రటరి కుమారి తదితరులు ఉన్నారు.

■ ఉపసర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

రొంపిచర్ల: మండలంలోని తురిమెళ్ల గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఏడుగురు వార్డు మెంబర్లు హాజరు కాగా పి. బాల నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా లక్ష్మీకుమారి వ్యవహరించారు. గురువారం నిర్వహించాల్సిన ఉపసర్పంచ్ ఎన్నిక సభ్యుల హాజరు శాతం తక్కువగా ఉండటంతో కోరం కాలేదని ఎన్నిక వాయిదా వేసిన విషయం విదితమే.

■ 31లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలి

యడ్లపాడు: ఈ-కేవైసీ ప్రక్రియను ప్రజలు వేగవంతంగా చేయించుకోవాలని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. మండల కేంద్రమైన యడ్లపాడులో పౌర సరఫరాల శాఖ నిత్యావసర సరుకుల ప్రజా పంపిణీకి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న ఈ-కేవైసీ నిర్వహణను శుక్రవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ వెంట డీటీ ఎస్ అనురాధ, వీఆర్వో చారి, ఎండీయూ ఆపరేటర్లు సిబ్బంది ఉన్నారు.

■ వ్యాసరచన పోటీలు

శావల్యాపురం: వ్యవసాయ సహకార పరపతి సంఘం అంతర్జాతీయ సహకార సంవత్సరం పురస్కరించుకొని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8,9 విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ నర్రా సురేంద్ర బాబు పాల్గొని మాట్లాడుతూ సహకార విలువలు సహకార సూత్రాల ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

■ మార్కెట్ యార్డు చైర్మన్‌గా పూనాటి

నరసరావుపేట రూరల్: స్థానిక మార్కెట్ యార్డు చైర్మన్‌గా పమిడిపాడు గ్రామ టీడీపీ నాయకుడు పూనాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పూనాటి టీడీపీ మండల అధ్యక్షుడిగా కూడా పనిచేశారు.

నాడు పగులగొట్టమన్నావుగా!

- మరి నేడు ఎందుకు బిగించమంటున్నావు?
- మంత్రి నారా లోకేష్‌పై సీపీఎం నేత ధ్వజం
- స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూ అప్ చార్జీలపై నిరసన



బరంపేట విద్యుత్ కార్యాయం ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తేవాటిని పగులగొట్టాలని నాడు యువగళం పాదయాత్రలో వ్యాఖ్యానించిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ నేడు వ్యవసాయ మోటార్లతో పాటు వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నా నోరు మెదపడం లేదని, దీనిపై మంత్రి లోకేష్ స్పందించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శిగుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరిట అదనపు బాదుడుకు వ్యతిరేకంగా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం బరంపేటలోని విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి జేఏవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ అదనపు భారాలను తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకుంటామని చెప్పారని గుర్తుచేశారు. అదనపు భారాలు తగ్గించకపోగా స్మార్ట్ మీటర్ల బిగింపు చర్యను వేగవంతం చేసిందని మండిపడ్డారు. మరోపక్క పేద ప్రజల ఆదాయాలు, కార్మికుల వేతనాలు పెరగక అదనపు విద్యుత్ ఛార్జీలు చెల్లింపునకు ప్రజానీకం అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానం మేరకు విద్యుత్ అదనపు చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో విద్యుత్ పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయనాయక్, టి.పెద్దిరాజు, మండల కార్యదర్శి డి.శివకుమారి, కొమ్ముల నాగేశ్వరరావు, మేడం ఆంజనేయులు, షేక్ చిన్న అల్లాబక్షు, చంద్రబోస్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలి

జేసీకు క్రైస్తవ సంఘాల నాయకులు వినతి



నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవ బోధకులు, నాయకులు

నరసరావుపేట: ప్రముఖ క్రైస్తవ బోధకులు, క్రైస్తవ ఆణిముత్యం పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయించాలని దైవ సేవకులు, సువార్తికులు, క్రైస్తవ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు పల్నాడు డిస్ట్రిక్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ ఫౌండర్, ప్రెసిడెంట్ బిషప్ జయప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమకు పాస్టర్ ప్రవీణ్ మరణంపై పలు అనుమానాలు ఉన్నాయని, ఈ విషయంపై సరైనటువంటి న్యాయం జరగాలని క్రైస్తవ సమాజం కోరుకుంటుందని, వెంటనే ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. పల్నాడు జిల్లా జనరల్ సెక్రెటరీ గుడిసె ప్రకాష్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అమర్తపూడి యెహోషువ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ కాల్వ ఏసుపాదం, జిల్లా ట్రెజరర్ అక్కల సువర్ణరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కూనాల మోజెష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎన్.ఏసుదాసు, జిల్లాలోని నియోజకవర్గ ప్రెసిడెంట్లు, మండల ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రెటరీలు. ట్రెజరర్లు. లీడర్లు దైవ సేవకులు విస్తృతంగా పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ : రాజమండ్రి వద్ద మరణించిన పాస్టర్ ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు యాక్సిడెంట్‌గా చిత్రీకరించాలని చూస్తున్నారని, చూసిన ప్రతి ఒక్కరూ ఇది హత్య అని అంటున్నారని, ఈ మరణాన్ని హత్యనేరంగా పరిగణించి కేసు నమోదు చేసి దోషులను శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సుబ్బారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని శివయ్యస్తూపం సెంటర్‌లో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధానకార్యదర్శి మారుతీ వరప్రసాద్, బూదాల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, బొంత నాగేశ్వరరావు, దావీదు, మార్కు, మరియదాసు పాల్గొన్నారు.

హక్కులు కాపాడటంలో ప్రభుత్వాలు విఫలం

దళిత హక్కుల పోరాట సమితి నేత సుబ్బారావు



మాట్లాడుతున్న సుబ్బారావు

వినుకొండ: దళిత బలహీన వర్గాల హక్కులు కాపాడటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు ఆరోపించారు. పట్టణంలోని శివయ్య భవన్‌లో శుక్రవారం సమితి జిల్లా మహాసభ నిర్వహించారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించిన నాటి నుంచి నేటి వరకు బలహీన వర్గాలు అణచబడుతూనే ఉన్నారని, వారిలో దళితులు మరింత దయనీయ స్థితిలో ఉన్నారన్నారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ పేద దళిత బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసి కాపడుతున్నది ఎర్రజెండా అన్నారు. కార్యక్రమంలో బూదాల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, పవన్ కుమార్, నాగేశ్వరరావు, వెంకట్రావు, పౌలు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో కార్పొరేషన్ల రుణమేళా



రుణమేళా నిర్వహిస్తున్న ఎంపీడీవో పి.సీతారామయ్య

బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రుణమేళా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి. సీతారామయ్య మాట్లాడుతూ బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య తదితర వర్గాలకు చెందిన లబ్ధిదారులకు ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించే ఉద్దేశంలో భాగంగా ప్రభుత్వం రుణమేళాకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆయా వర్గాలకు చెందిన సుమారు 290కిపైగా ఆన్‌లైన్ దరఖాస్తులు అందాయన్నారు. లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. సుమారు 40 యూనిట్లకు పైగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను బ్యాంక్ అధికారులు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ వెల్లటూరు శాఖ అధికారులు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఈనాం భూముల నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న తహసీల్దారు రమేష్‌కుమార్

నూజెండ్ల: మండలంలోని వి. అప్పాపురం గ్రామంలో ఈనాం భూముల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఫాం-5 నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ1956 చట్టం ప్రకారం సెటిల్‌మెంట్ చేయు నిమిత్తం ఫాం-5 ప్రతిని సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాలు, ఐనవోలు పోలీసు స్టేషను, తిమ్మాపురం గ్రామములో ప్రచురణ చేశామన్నారు. సదరు విషయాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని వచ్చే నెల 10వ తేదీలోగా లిఖిత పూర్వకంగా తహసీల్దారు కార్యాలయంలో సమగ్ర ఆధారాలతో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు బాల వెంకటేశ్, వీఆర్వో నాసర్ సాహెబ్, పంచాయతీ కార్యదర్శులు ఎస్.జానీబాష, పి.శివకోటేశ్వరరావు, గ్రామ సర్వే సహాయకురాలు వి.ప్రియాంక, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.